
వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 81
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
డిసెంబర్ 13, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





## అటు జైలు.. ఇటు బెయిల్

8లో..



# జూ పార్క్‌కు వైట్ టైగర్స్

- సింహాన్ని కూడా తెప్పించే ప్రయత్నం
- సెంట్రల్ జూ అథారిటీతో సంప్రదింపులు
- మురుగు కాలువను బయటికి మళ్లించేలా చర్యలు
- త్వరలో ఎన్విరాన్ మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్ ఏర్పాటు
- మంత్రి సురేఖ చొరవతో పలు అభివృద్ధి కార్యక్రమాలు




రాష్ట్ర వ్యాప్తంగా జూ పార్కులతో పాటు, అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా సందర్శకులను మరింతగా ఆకట్టుకునేలా అటవీ శాఖ కార్యాచరణను రూపొందిస్తోంది. అందులో భాగంగానే వరంగల్ లోని కాకతీయ జూ పార్కును అన్ని హంగులతో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నారు. ఈ మధ్యే వరంగల్ జూ పార్కుకు పులిని తరలించిన నేపథ్యంలో సందర్శకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే సందర్శకులను మరింతగా ఆకట్టుకునేలా మరో రెండు వైట్ టైగర్లతోపాటు సింహాన్ని తెప్పించే దిశగా చర్యలు చేపట్టారు. ఈ మేరకు సెంట్రల్ జూ అథారిటీతో సంప్రదింపులు చేపట్టారు. వైట్ టైగర్లు జూ పార్కుకు వస్తే మరింత ఆకరణగా ఉంటుంది. అదేవిధంగా వరంగల్ జూ పార్కుతో పాటు రాష్ట్రంలోని ఇతర జూ పార్కుల్లో ఎన్విరాన్ మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్లను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే కాకతీయ జూ పార్క్ అభివృద్ధికి మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవ చూపడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి

వివరాలు2లో..



## కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- సీఎంతో కలిసి కేంద్ర రైల్వే శాఖ మంత్రికి వినతి

8లో..



## గ్రూప్-2 పరీక్షలకు భారీ బందోబస్తు

- పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు
- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

8లో..

## సమష్టిగా అభివృద్ధి చేద్దాం

- మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి
- పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి
- వరంగల్, హనుమకొండ కలెక్టర్ లతో కలిసి సమీక్ష






# జూ పార్క్ కు వైట్ టైగర్స్






- సింహాన్ని కూడా తెప్పించే ప్రయత్నం
- సెంట్రల్ జూ అథారిటీతో సంప్రదింపులు
- మురుగు కాలువను బయటికి మళ్లించేలా చర్యలు
- త్వరలో ఎన్విరాన్ మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్ ఏర్పాటు
- మంత్రి సురేఖ చొరవతో పలు అభివృద్ధి కార్యక్రమాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ లోని కాకతీయ జూ పార్క్ పై స్పెషల్ ఫోకస్ పెట్టారు. సౌకర్యాలు మెరుగు పరచడంతోపాటు జంతువుల సంఖ్యను పెంచడం ద్వారా సందర్శకులను ఆకట్టుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కాకతీయ జూ పార్కునకు రెండు వైట్ టైగర్స్ తోపాటు సింహాన్ని తెప్పించే దిశగా సెంట్రల్ జూ అథారిటీని సంప్రదించాలని మంత్రి చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఏలుసింగ్ ను ఆదేశించారు. ఈ మధ్యే వరంగల్ జూ పార్కునకు పులిని తరలించిన తర్వాత సందర్శకుల సంఖ్య పెరుగుతున్నట్లు అధికారులు మంత్రికి తెలిపారు. వరంగల్ జూ పార్కుతో పాటు ఇతర జూ పార్కుల్లో ఎన్విరాన్ మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. కాకతీయ జూ పార్కు మధ్య ప్రవహిస్తున్న వరదనీటి డ్రైనేజీ కారణంగా దుర్వాసన వస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. అయితే డ్రైనేజీని జూ పార్కు బయటకు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

### కోతుల సమస్య నివారణకు...

వరంగల్, హనుమకొండతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కోతుల బెడద రోజు రోజుకూ ఎక్కువవుతోందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోతుల నివారణకు సంబంధిత అన్ని శాఖలతో కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ నిర్వహించి, సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనేలా చర్యలు చేపట్టాలన్నారు. కోతులను వన్యప్రాణి జాబితా నుంచి తొలగించినందున ఈ దిశగా కచ్చితమైన విధివిధానాలను రూపొందించి కోతుల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని మంత్రి సురేఖ పీసీసీఎఫ్ డోబ్రియాల్ ను ఆదేశించారు.

### అవినాభావ బంధం..

జంతువులు ,మనుషులు, అడవులు మధ్య అవినాభావ సంబంధమున్నదన్న విషయాన్ని మనం సదా గుర్తు పెట్టుకోవాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. జూ పార్కుల్లో జంతువుల భావోద్వేగాలను పరిశీలించాలని, వాటి సంరక్షణకు ప్రత్యేకంగా శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. ప్రతి జూ పార్కులో జంతువుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుగా పశుసంవర్ధకశాఖతో సంప్రదించి వెటర్నరీ డాక్టర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రతి మూడు నెలలకొక మారు జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (జపాట్) మీటింగ్ ను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. అటవీ శాఖకు చెందిన రాష్ట్ర పథకాలకు కేంద్ర ప్రభుత్వ నిధులు వచ్చేలా చర్యలు చేపట్టి, ఆ నిధులను జూ పార్కుల్లో మౌలిక వసతుల కల్పనకు వెచ్చించేలా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను నిర్దేశించారు. అటవీ అధికారులతో కలిసి యానిమల్ అడాప్షన్ స్కీమ్ బ్రోచర్, డైరీ, కాఫీ టేబుల్ బుక్ ను మంత్రి సురేఖ ఆవిష్కరించారు.









## నెలాఖరులోగా 'ఇందిరమ్మ'సర్వే పూర్తి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సర్వే అధికారులకు ఆదేశించారు. శుక్రవారం హసన్ పర్తి మండలంలోని భీమారం, పెంబర్తి గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూమి ఉండి గృహ నిర్మాణం కోసం సమగ్ర సర్వే ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా ప్రత్యేక బృందాల పనితీరు, లబ్ధిదారుల వివరాలను పొందుపరచు తీరును సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు గృహ నిర్మాణానికి అవసరమైన స్థలంతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డును పరిశీలించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. రేషన్ కార్డులో తప్పనిసరిగా లబ్ధిదారుల పేరును ఉండేలా చూడాలని తెలిపారు. అదేవిధంగా సర్వేలో పూర్తిగా సేకరించిన లబ్ధిదారుల వివరాలను యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే త్వరితగతిన పూర్తయ్యేలా తగిన ప్రణాళికలు రూపొందించాలని సర్వే అధికారులను ఆదేశించారు. నమోదు ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. దరఖాస్తుదారులు ఒకచోట నివసిస్తూ ఉండి వారికి వేరొక ప్రదేశంలో స్థలం ఉన్నట్లయితే అటువంటి దరఖాస్తులను తీసుకొని వివరణలో తగిన వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి దరఖాస్తు వివరాలు యాప్ లో నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### సెలవుల్లో కలెక్టర్..

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య వ్యక్తి గత అవసరాల నిమిత్తం 10 రోజుల సెలవుకు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును పరిశీలించిన ప్రభుత్వం సెలవులకు అనుమతిచ్చింది. అయితే ప్రస్తుతం వరంగల్ జిల్లా కలెక్టర్ గా విధి నిర్వహణలో ఉన్న డాక్టర్ సత్య శారదకు పది రోజుల పాటు హనుమకొండ జిల్లా కలెక్టర్ గా అదనపు బాధ్యతలు అప్పగించింది.

## 15 న దత్త జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మార్గశిర మాసం పౌర్ణమి రోజున దత్త స్వామి జయంతిని పురస్కరించుకొని ములుగు రోడ్డు శ్రీ వరద దత్త క్షేత్రంలో శ్రీ వరద దత్తాత్రేయ స్వామి వారి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీ గణపతి సచ్చిదానంద దత్త జ్ఞాన బోధ సభ ట్రస్ట్ సభ్యులు వైవీ వామన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి దర్శనం, నిత్య పూజ, ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు దత్తాత్రేయ స్వామీ ఉత్సవమూర్తికి భక్తుల చేత తైలాభిషేకం, సుగంధ ద్రవ్యములు, పంచ అమృతంలతో అభిషేకం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా ఉదయం 11 గంటలకు నిర్వహించే శ్రీ దత్త హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. అనంతరం స్వామీ అలంకరణ, అర్చన, మహా నైవేద్యం, మహా మంగళ హారతి, మంత్ర పుషం జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి మొత్తం 54 సార్లు శ్రీ దత్త స్తవం భక్తులచే పారాయణం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచి భక్తులకు మహా అన్న ప్రసాద వితరణ జరుగుతుంది. ఈ పూజ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వైవీ వామన్ రావు తెలిపారు.

## 14 న 'గోపా' సర్వసభ్య సమావేశం

**వరంగల్ వాయిస్, జనగామ :** గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జనగామ జిల్లా సర్వసభ్య సమావేశం ఈనెల 14న శనివారం ఉదయం 11 గంటలకు నెల్లుట్ల రోడ్డులోని కెమిస్ట్స్ భవన్ లో నిర్వహించనున్నట్లు గోపా కార్యదర్శి గూడ రాజబోస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు గౌడ్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ మహాసభలో జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు సకాలంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల కమిటీ సభ్యులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్రేముల యాదగిరి గౌడ్, చెక్కిళ్ల మధుసూదన్ గౌడ్, వ్యవస్థాపక అధ్యక్షుడు కన్న పరశురాములు గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తారని గూడ రాజబోస్ వెల్లడించారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, డిసెంబర్ 13, 2024

# దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ

## ➲ డాక్టర్ సాయి రమేష్, అనితా రెడ్డి





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాల ముగింపు సంబరాలను అనురాగ్ సొసైటీ చైర్మన్, ది.నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ నేషనల్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అనితా రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ది.నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ సాయి రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం పిల్లలకు పుస్తకాలు,స్టేషనరీ పంపిణీ చేశారు. పిల్లలు పాటలు పాడి, డాన్స్ లు చేసి అలరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి రమేష్ మాట్లాడుతూ, దివ్యాంగుల వారోత్సవాలు అంటే ముందుగా వారిని గౌరవించాలి, వారి ఎదుగుదలకు చేయూతనివ్వాలి, వారి హక్కులను కాపాడాలని అప్పుడే అది నిజమైన దివ్యాంగుల సంబరాలవుతాయని అన్నారు. వీరికి ఏ సహాయ సహకారాలు కావాలన్న తాము చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దివ్యాంగుల సేవ విశ్వ మానవసేవ అని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. మానసిక దివ్యాంగులకు అందరిలాగే వారసత్వపు హక్కు ఉంటుందని కానీ, వారు ఏమి చేసుకుంటారని తల్లిదండ్రులు వారికి మిగతా పిల్లలకు ఇచ్చినట్లు ఇవ్వడం లేదని, అది చాలా తప్పు అని తల్లిదండ్రుల తరువాత వీరు బతకడాని ఆ ఆస్తి ఎంతో భద్రత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి రమేష్, డాక్టర్ అనితా రెడ్డి, సౌత్ ఇండియా చైర్మన్ సత్యనారాయణ, తెలంగాణ చైర్మన్ రామ్మోహన్, తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నవీన్, స్పందన నిర్వాహకులు సుచరిత, రాజేందర్ రెడ్డి, వసుధ, హరిత, ప్రభాకర్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# సైడ్ డ్రైన్ నిర్మాణ పనుల ప్రారంభం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా శుక్రవారం 50వ డివిజన్ సహకార్ నగర్ లో రూ. 25లక్షల నిధులతో సైడ్ డ్రైన్ నిర్మాణ పనులను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కి ఇటీవలే 187కోట్ల నిధులను కేటాయించారని, ప్రాధాన్యత పరంగా కాలనీలలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామన్నారు. అంతకు ముందు గణపతి దేవాలయంలో గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నెక్కొండ కవిత కిషన్, డివిజన్ అధ్యక్షులు సయ్యద్ ఆప్సర్, కాలనీ వాసులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

# సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల వినూత్న నిరసన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలంటూ జిల్లా కేంద్రంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు రహదారిపై మోకాళ్లపై బైఠాయించి మానవహారంతో నిరసన చేపట్టారు. తమ ఉద్యోగులకు భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మహంకాళి వీరన్న మాట్లాడుతూ ఎన్నికల ముందు టీపీసీసీ అధ్యక్ష హోదాలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయాలని, లేనిపక్షంలో అప్పటి వరకు పే స్కేల్ సదుపాయం కల్పించి ఎస్ఎస్ఏ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. గత 18 ఏళ్లుగా తమ చేత వెట్టి చాకిరి చేయిస్తున్నారని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో 19 వేల ఎస్ఎస్ఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి ప్రభుత్వం తమ కుటుంబాల్లో వెలుగులు నింపాలన్నారు. లేని పక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఎస్ఎస్ఏ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మహంకాళి వీరన్న, ఎస్ఎస్ఏ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కార్యదర్శిని సుమలత పాల్గొన్నారు. .

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పులో ఊబీలో నెట్టి రాష్ట్రాన్ని దివాళా తీశారని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం అంబేద్కర్ భవన్ లో హనుమకొండ మండలానికి సంబధించిన 106 మంది లబ్ధిదారులకు రూ.10612296 ల కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను, 75మంది లబ్ధిదారులకు రూ.29,99,500ల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్దిదారుడికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో లబ్ది చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన చాలా పథకాల్లో తమ రాజకీయ లబ్ది కోసం అమలు చేశారని ఎమ్మెల్యే నాయిని ఆరోపించారు. ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నామని అన్నారు. ఒకే రోజు దాదాపు 1కోటి 36 లక్షల పై చిలుకు చెక్కులను అందిచడం చాలా సంతోషంగా ఉందన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వొద్దని సభాముఖంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# "ఓ భామ అయ్యో రామ సినిమా షూటింగ్"



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** కలర్ ఫొటో ఫేం హీరో సుహాస్, హీరోయిన్ మాళవిక, సహ హీరోయిన్ నయని పావని, కమెడియన్ సాత్విక్ ఆనంద్ లు నటీనటులుగా, హరీష్ నల్ల, ఆనంద్ గాదెగొని నిర్మాతలుగా, రామ్ గోదాల దర్శకత్వంలో జనగామ జిల్లాలో పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమాకు ప్రొడక్షన్ మేనేజర్ గా పాలకుర్తికి చెందిన డాక్టర్ మేడారపు సుధాకర్ వ్యవహరిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ ఓ భామ అయ్యో రామ సినిమా చక్కటి ప్రేమ కథ చిత్రమని జనగామ జిల్లాలో పలు లొకేషన్ లలో షూటింగ్ చేస్తున్నట్టు తెలిపారు



# 22న 'కాకతీ' కదన భేరి

## ◆ సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా కేంద్రంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ చే రంగంపేట ప్రాథమికోన్నత పాఠశాల లో డిసెంబర్ 22న వరంగల్ లో జరగనున్న కాకతీ కదనభేరి పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర మంత్రి వర్గం యూపీఎస్ విధానాన్ని ఆమోదం తెలపిందని, ఏప్రిల్ 1 2025 నుండి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ డిసెంబర్ 22న ఉద్యోగ ఉపాధ్యాయులతో వరంగల్ జిల్లా కేంద్రంగా భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ ఏకీకృత పెన్షన్ విధానం అనేది కేవలం ఉద్యోగులను మోసగించి, కార్పొరేట్ల కడుపు నింపడానికి వచ్చింది తప్ప, ఉద్యోగి కుటుంబానికి సామాజిక భద్రత చేకూర్చే పథకం కాదన్నారు. దీన్ని తీవ్రంగా ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైనదని స్థిత ప్రజ్ఞ తెలిపారు. సంఘ సభ్యత్వ నమోదు ప్రారంభించారు. అందరూ ఉద్యోగ ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జీవన్ కుమార్ ,రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగమూర్తి, బుచ్చన్న, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మల్లికార్జున్, ఆఫ్జల్, కొండ శ్రీనివాస్, లక్ష్మమ్మూర్తి, రవీందర్ రెడ్డి, దిల్షాన్, శివ కోటి, రాజేందర్, నర్సమ్మ, సరళ రాణి, అశ్విని, రాజు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో మజ్దూర్ ఘనవిజయం



**వరంగల్ వాయిస్, కాజీపేట :** స్థానిక జరిగిన యూనియన్ ఎలక్షన్స్ లో భారతీయ రైల్వే ట్రేడ్ యూనియన్ మజ్దూర్ యూనియన్ ఘన విజయం సాధించింది. ప్రశ్నించడం మన హక్కు అనే నినాదంతో కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉండే సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ను జోన్ లో ఓట్లు వేసి గెలిపించి ప్రథమ స్థానంలో నిలబెట్టినందుకు కార్మిక సోదర సోదరీమణులకు వరంగల్ కాజీపేట రైల్వే స్టేషన్లలో స్వీట్లు పంచిన సెక్రటరీ సమ్మయ్య, చైర్మన్ రాజు, యూత్ ప్రెసిడెంట్ ముత్యాల విజయ్, సదాశివ్, యూత్ కన్వీనర్ రాజ్ కుమార్, హరీష్, రాధిక, రఫీ, ఈ కార్యక్రమంలో పాల్గొని రైల్వే కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

# అంధులను ఆదరించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అంధులకు ఆర్థికంగా సహాయం చేసి ఆదుకోవాలని టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ అడుప మహేష్ కోరారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ వద్ద గురువారం రాత్రి ఓ అంధుడు తన మధురమైన గానంతో జానపద పాటలు పాడుతూ బిక్షాటన చేయగా ఎవరూ అతడికి సహాయం చేయకపోగా కనీసం చూసిన పాపాన పోలేదు. అదే సమయంలో అటువైపు వెళుతున్న అడుప మహేష్ అంధుడిని చూసి రూ.1000 ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం అతడి కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాలాంటి అంధులు చాలామంది ఉన్నారని, సినిమా, జానపద పాటలు, మిమిక్రీ ద్వారా వచ్చే కొద్దిపాటి డబ్బులతో తమ పొట్ట నింపుకుంటామని అంధుడు తెలపడంతో మహేష్ చలించిపోయారు. అంధుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, న్యాయం జరిగే విధంగా తన వంతు సాయం చేస్తానని మహేష్ హామీ ఇచ్చారు.

# జిల్లా విద్యార్థులకు తృతీయ బహుమతి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హెచ్ఐవి ఎయిడ్స్ పై కేరళలో నిర్వహించిన రీజినల్ స్థాయి క్విజ్ పోటీల్లో హనుమకొండ జిల్లా విద్యార్థులు విధాత్రి కరీముల్ల అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తృతీయ బహుమతి నాకో డీడీజీ చేతుల మీదుగా రూ.20,000 నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నారు. క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు తోడ్పాటును అందించిన జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వప్న మాధురిని, విధాత్రి కరీముల్లలను, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మధన్ మోహన్ అభినందించారు.

# బాధితుడికి అండగా నిలిచిన తీన్మార్ మల్లన్న టీం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని సూర్య నాయక్ తండా గ్రామంలో మాలోతు రమేష్ ఇటీవల అనారోగ్యంతో శ్రీ లాస్య హాస్పిటల్ హనుమకొండలో తలలో రక్తం గడ్డ కట్టడం వలన ట్రీట్మెంట్ తీసుకోవడం జరిగింది. ప్రైవేట్ హస్పిటల్ కావడం వల్ల 50 వేలకు పైగా హాస్పిటల్ బిల్లు అయింది. దానికి అ నిరుపేద కుటుంబం అంతా చెల్లించలేమని తీన్మార్ మల్లన్న టీంను ఆశ్రయించారు. దీంతో భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి వేల రూపాయలు తగ్గించి హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేయించారు. ఈ కార్యక్రమాన్ని శాయంపేట మండల అధ్యక్షుడు తీన్మార్ టీం వాళ్లను దగ్గరుండి ఇంటికి సురక్షితంగా తీసుకురావడం జరిగింది. అందుకు గాను గ్రామ ప్రజలు, వారి కుటుంబ సభ్యులు తీన్మార్ మల్లన్న టీంకు కృతజ్ఞతలు., ధన్యవాదాలు తెలియజేశారు.

# గోవులను కబేళాలకు తరలించే వారిని శిక్షించాలి

## ➲ బీజేపీ నేత విజయ చందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, గీసుకొండ :** మండలం కోటగండి బీజేపీ వరంగల్ జిల్లా కార్యాలయంలో పత్రిక మిత్రుల సమావేశంలో బీజేపీ నాయకులు విజయ్ చందర్ రెడ్డి మాట్లాడుతూ హిందువులు అత్యంత పరమ పవిత్రంగా కొలిచే రాజన్న కోడెలను గోశాల పేరుతో అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అనుచరుడు రాంబాబు, ఈ పాపంలో పాలుపంచుకున్న మండల ముఖ్య కాంగ్రెస్ నాయకులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోనవాలన్నారు. యావత్తు హిందు సమజానికి మంత్రి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలన్నారు. అలాగే కేసును నీరు గార్చకుండా జ్యుడీషియల్ ఎంక్వైరీ వేసి దోషులను శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయ్ చందర్ రెడ్డి, పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీప్రసాద్ రావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కూతురు రాజు, అసెంబ్లీ కన్వీనర్



ముల్క ప్రసాద్, మండల అధ్యక్షులు జాన్ విక్రమ్, మండల ప్రధాన కార్యదర్శి కొంగర రవికుమార్, ఎడకుల రాజీరెడ్డి, కత్తి వెంకన్న, కోట శివ, బీజేవైఎం మండల అధ్యక్షుడు అడువల అఖిల్, జల్లెల శివ, గట్టుమీది బాలరాజు, మాడిశెట్టి రాము, కండికొండ ప్రదీప్, అల్లం కెదరి, ఆకుల వెంకన్నా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్యం గౌతమ్ కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గా ఎన్నికైన ప్రముఖ పీడియాట్రిషన్, డయాబెటాలజిస్ట్ వైద్యం గౌతమ్ ను అఖిల భారత హనుమకొండ జిల్లా కమిటీ ఘనంగా సన్మానించింది. హనుమకొండలోని అభయ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో వైద్యం గౌతమ్ కు హనుమకొండ జిల్లా కమిటీ అధ్యక్షుడు బచ్చు ఆనందం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే పద్మశాలి సంఘ పెద్దలు, ప్రజా ప్రతినిధులు గౌతమ్ ను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో పాటు అభయ హాస్పిటల్ వైద్య సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్, అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల నరేందర్, రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్, ప్రధాన కార్యదర్శి కేదాసి వెంకన్న, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పోరండ్ల కృష్ణ ప్రసాద్, ఉపాధ్యక్షులు నల్ల సత్యనారాయణ, వెంగళ వేణుగోపాల్, మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, సత్కూరి సంతోష్, గైని సత్యనారాయణ, గాదే ధనుంజయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మహా కుంభమేళా యాత్రకు ప్రత్యేక రైలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా ప్రయాణికుల కోసం రద్దీ లేకుండా 8 రాత్రులు, 7 పగుళ్లు నిరంతరాయంగా ప్రయాణించే మహా కుంభమేళా పుణ్యక్షేత్ర యాత్ర ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు, ఈ రైలును భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్ సీటీసీ) టూరిజం మానిటర్ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన టూర్ ప్యాకేజీ వివరాలు వెల్లడించారు. ఈ ప్రత్యేక రైలు జనవరి 19న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి భువనగిరి–జనగాం– కాజీపేట–వరంగల్–మహబూబాబాద్–డోర్నకల్–ఖమ్మం–మధిర–విజయవాడ–ఏలూరు–రాజమండ్రి–సామర్ల కోట–తుని రైల్వే స్టేషన్ల మీదుగా వెళుతుందన్నారు. ఈ రైలులో అతి చౌకగా ప్రయాణించి వారణాసి,అయోధ్య, ప్రయాగ్ రాజ్ పుణ్యక్షేత్రాలు ఆధ్యాత్మిక తదితర పర్యాటక ప్రాంతాలను తిలకించవచ్చన్నారు. ఈ రైలులో 576 బెర్తులు, ఏకనామి, స్టాండర్డ్, కంఫర్ట్, మూడు రకాలుగా ఉంటాయని ఒక టికెట్ రూ.22,635 ఉంటుందన్నారు. ఈ మీడియా సమావేశంలో ఐఆర్ సీటీసీ టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్ సేంగర్, టూరిజం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నరేష్ బాబులు, ప్రశాంత్, టూరిజం మానిటర్ పాల్గొన్నారు.

# ఎస్ఎంఆర్ స్కూల్ లో గీతా జయంతి వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నక్కలగుట్టలోని ఎస్ఎంఆర్ స్కూల్ లోగీతా జయంతిని పురస్కరించుకొని నేడు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఆరవ అధ్యాయం ఆత్మ సమయం యోగంలో జరిగిన పోటీలలో జూనియర్స్ విభాగంలో వరుసగా ఎం అద్వైత, కే కార్తీక్, ఏ సాయి ప్రసన్నలకు సీనియర్స్ విభాగంలో వి.అక్షయని, కే కౌశిక్, సీహెచ్ అభిరామ్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. వీరికి ప్రశంసా పత్రాలు నగదు, శ్రీమద్రామాయణ సంగ్రహం పుస్తకాలు ఇవ్వడం జరిగింది. అంతేకాక 700 శ్లోకాలు పూర్తిగా వచ్చిన వారికి జరిగిన పోటీలలో 700 శ్లోకాల్లో ఎక్కడ అడిగితే అక్కడ చెప్పిన గృహిణి గుండ శ్రీలత ప్రథమ బహుమతిని పొందారు. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ రామన్న టీటీడీ దార్మ ప్రచార మండల సభ్యులు దేవి రెడ్డి, అంజిరెడ్డి, కుంభ అశోక్ కుమార్, పోశాల శ్రీనివాస్ పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా తెన్నేటి వసుంధర, నాగిళ్ల వేణు శర్మ, దేవుడిది అంజిరెడ్డి, శ్రీరామ, జయప్రభ వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టీటీడీ కార్యక్రమం నిర్వహికులు రామిడి కృష్ణమూర్తి మాట్లాడుతూ



విద్యార్థులలో భక్తి చైతన్యాన్ని నింపడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎంఆర్ స్కూల్ కరస్పాండెంట్ వెలగందుల ముక్తేశ్వర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం మా స్కూల్లో పెట్టడం చాలా సంతోషమన్నారు. మా విద్యార్థులకి మేము ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు రోజు భగవద్గీత శ్లోకాలు నేర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలు పెట్టినందుకు టీటీడీ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ సీఎంఆర్ సంస్కృత ఉపాధ్యాయురాలు జోష్ణ, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా సద్గురు శివానంద మూర్తి జయంతి వేడుకలు

◆ ఈ నెల 18 నుంచి 20 వరకు కార్యక్రమాలు




**వరంగల్ వాయిస్, ములుగు రోడ్డు :** సద్గురు శివానంద మూర్తి 96వ జయంతి వేడుకలు సందర్భంగా ఈనెల 18 నుంచి 20 వరకు మూడు రోజులు కార్యక్రమాలు నిర్వహించబడతాయని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. శుక్రవారం గురుధామంలో జరిగిన ఒక పాత్రికేయుల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మొదటి రోజు 18 డిసెంబర్ ఉదయం 10 గంటలకు భారతీయ సంస్కృతి పరిరక్షణ వికాసం-నేటి యువత పాత్ర మీద వ్యాసరచన పోటీలను నిర్వహిస్తామని దానిలో మొదటి బహుమతి రూ.5116 గా, రెండో బహుమతిగా రూ.3116, మూడవ బహుమతిగా రూ.1116 ఇస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల-మత భేదాలతో సంబంధం లేకుండా అందరూ పాల్గొనవచ్చునని అదే విధంగా రెండో రోజు 19 డిసెంబర్ ఉదయం 10 గంటలకు భగవద్గీతలోని రెండవ అధ్యాయం 48, 50 శ్లోకాలు, మూడో అధ్యాయం ఏడవ శ్లోకము మూడింటిపై ఉచ్ఛరణ, తాత్పర్యము చెప్పిన వారికి మొదటి బహుమతి కింద రూ.5116, రెండో బహుమతి కింద రూ.3116, మూడో బహుమతి కింద రూ.1116 లో అందించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనుటకు వయసు 16 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల లోపు వారు మాత్రమే అర్హులన్నారు. నిర్వాహకులు కేవలం వ్యాసరచన పోటీలో పేపర్లు మాత్రమే అందిస్తారని మిగిలిన పెన్ను ప్యాడ్ పోటీదారులు తెచ్చుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ములుగు రోడ్డులో అయ్యప్ప గుడి పక్కన గల సప్త ధామంలో ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తామని, ఈ విషయం తెలుసుకొని మన జిల్లా వాసుల్లో ఉన్న యువత అందరూ కూడా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరొక ట్రస్ట్ బందారు సాయినారాయణ మాట్లాడుతూ వచ్చిన వారందరికీ మహా భోజన ప్రసాదం అందించబడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాదారపు సదాశివుడు, గందె ఉమా శంకర్, సంపత్, రాజా మొగిలి పాల్గొన్నారు.

# గుట్కా విక్రయాలపై పోలీసుల దాడి



**వరంగల్ వాయిస్, క్రైం :** హసన్ పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎలాంటి అనుమతి లేకుండా గుట్కా అక్రమ విక్రయాలపై విశ్వసనీయ సమాచారంపై, టాస్క్ ఫోర్స్ బృందం అప్పాని శ్రీధర్ (48)పై శుక్రవారం పోలీసులు దాడి చేసి అతనిని పట్టుకొని అతని వద్ద నుంచి గుట్కా మొత్తం రూ.10,000 స్వాధీనం చేసుకున్నారు. దాడి పూర్తయిన తర్వాత స్వాధీనం చేసుకున్న సొత్తుతో పాటు నిందితులను తదుపరి చర్యల నిమిత్తం హసన్‌పర్తి పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ జి.బాబులాల్, టాస్క్ ఫోర్స్ బృందం, హసన్ పర్తి పోలీసులు పాల్గొన్నారు.

# బూత్ అధ్యక్షుల ఎన్నిక



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని కోగిల్వాయి గ్రామంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మండల రిటర్నింగ్ అధికారి కాచం గురు ప్రసాద్ ఆధ్వర్యంలో 77, 78 బూత్ లలో బూత్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. 77 బూత్ అధ్యక్షుడిగా చుక్క మహేందర్ మాదిగ, 78 బూత్ అధ్యక్షులుగా పెరుగు స్పందన యాదవ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజకుమార్, శక్తి కేంద్ర ఇంచార్జి కొండి ప్రేమ్ కుమార్, కోఆప్షన్ నెంబర్ పాలకుర్తి శ్రీలత గౌడ్, గడబోయిన రమేష్ యాదవ్, సంఘనబోయిన వేణు, పోటు అనిల్, పెరుగు కుమారస్వామి, ఐల నాగరాజు, గడ్డం దేవేందర్, పాలకుర్తి శివాని గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

## సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డి.తిరుపతి



**వరంగల్ వాయిస్, పరకాల :** పేదలు, కార్మికులు, ఉద్యోగులు, కష్టజీవుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఎం హనుమకొండ జిల్లా రెండవ, మహాసభలు డిసెంబర్ 14, 15వ, తేదీలలో హసన్ పర్తిలో జరుగుతున్నాయని, వాటిని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డి.తిరుపతి పిలుపునిచ్చారు. పరకాల అమరధామంలో సీపీఎం మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. జిల్లాలోని ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలు, కార్మికులు, కర్షకులు, పేదలు, మహిళలు తదితర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం భవిష్యత్తు కార్యచరణ రూపొందించడం కోసం ఈ మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. కేంద్రంలో బీజేపీ గత పది సంవత్సరాలుగా అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు పారిశ్రామిక రంగాన్ని వ్యవసాయ రంగాన్ని దివాళ తీశాయి. విద్య, వైద్యం సామాన్యులకు అందని ద్రాక్షగా మారిందన్నారు. దీంతో ఆర్థిక అసమానతలు పెద్ద ఎత్తున పెరిగాయి. ప్రజలు చెమటోర్చి నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం అంబానీ, ఆదాని లాంటి బడా కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా కట్టబడుతుంది. దేశంలో ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులు, రాష్ట్రాల హక్కులపై రాజ్యాంగం పై దాడి చేస్తుంది. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుకై ఉద్యమాలకు ప్రజలను సిద్ధం చేసేందుకు కోసం జరుగుతున్న మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మడికొండ ప్రశాంత్, ఓర్సు చిరంజీవి, మాటూరు సతీష్, బి.నిఖిల్ లు పాల్గొన్నారు.

# ఏసీపీని కలిసిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు కోడెపాక కుమారస్వామి



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** పరకాల నూతన ఏసీపీగా పదవీ బాధ్యతలు చేపట్టిన సతీష్ ను ఏసీపీ కార్యాలయంలో జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు కోడెపాక కుమారస్వామి కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజారాం, కార్యదర్శిగా మెరుగు ప్రసన్నానంద్





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) హనుమకొండ జిల్లా కమిటీలో పరకాల మండలం వెల్లంపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు అజ్మీర రాజారాం, అలియాబాద్ పాఠశాల ఉపాధ్యాయుడు మెరుగు ప్రసన్నానంద్ జిల్లా ఉపాధ్యక్షులుగా, జిల్లా కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అధిక సాంద్రత పత్తి సాగుపై శిక్షణ




**వరంగల్ వాయిస్, దామెర :** పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం మమునూరు ఆధ్వర్యంలో కేంద్రీయ పత్తి పరిశోధనా స్థానం సహాయంతో జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా అధిక సాంద్రత పత్తి సాగుపై దామెరలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్ర సేద్య విభాగ శాస్త్రవేత్త డా.సౌమ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగ శాస్త్రవేత్త డా.సౌమ్య మాట్లాడుతూ రైతులు అధిక సాంద్రత పద్ధతిలో ప్రత్తి పంటను సాగు చేయడం వలన కూలీల ఖర్చు, పంట కాలం తగ్గుతుందని, ఎక్కువ దిగుబడి వస్తుందని తెలిపారు. యాంత్రీకరణ సాధ్యమవుతుందని, కాబట్టి, రైతులు ఈ పద్ధతిలో ప్రత్తి సాగు చేయాలని సూచించారు. తర్వాత జాతీయ ఆహార భద్రత కన్సల్టెంట్ సారంగం మాట్లాడుతూ అధిక సాంద్రతలో ప్రత్తి సాగు చేయడం వలన గులాబీ రంగు పురుగు ఉధృతి నుంచి పంటను కాపాడుకొవచ్చనీ, దీని నివారణకు రైతులు సమగ్ర సస్య రక్షణ పద్ధతులు పాటించాలని తెలిపారు. అదే విధంగా రాబోయే సంవత్సరం ఎక్కువ మొత్తంలో ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. తర్వాత ఏడీఏ మాధవి మాట్లాడుతూ ప్రస్తుత దశలో ప్రత్తి పంటలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు గురించి, అలాగే ఈ పద్ధతిలో పంట కాలం తక్కువగా ఉంటుందని కాబట్టి, రైతులు ప్రత్తి పంటను తీసి వేసి ఇతర పంటను వేసుకోవడం వలన ఇతర ఆదాయం పొందవచ్చున్నారు. దీని వలన రైతు ఆదాయం పెరుగుతుందని, పంట మార్పిడి కూడా అవుతుందని, ఎకరానికి మొక్కలు సంఖ్య పెరుగుతుందని తెలిపారు. తర్వాత సస్యరక్షణ విభాగం డా.రాజు శాస్త్రవేత్త గులాబీ రంగు పురుగు నివారించే పద్ధతులు, లింగాకర్షక బుట్టల పాత్ర, అధిక సాంద్రతలో సాగు చేయడం వలన గులాబీ పురుగు ఉధృతి నుంచి పంటను కాపాడుకోవచ్చని సూచించారు. శాస్త్రవేత్తల బృందం రైతులు అడిగన ప్రశ్నలకు శాస్త్రీయ సలహాలను, సమాధానాలు అందించారు. రైతులు ఐలేష్, రాజేశ్వరరావు ఈ పద్ధతిలో ప్రత్తి సాగు చేయడం వలన అధికంగా దిగుబడి వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దామెర ఏఓ రాకేష్, ఏఈఓలు అరుణ్, రామకృష్ణ, రాశి విత్తన సంస్థ, టెరిటరీ మేనేజర్ రాజిరెడ్డి, సేల్స్ ఆఫీసర్ నాగరాజు, కేవీకే యంగ్ ప్రొఫెషనల్ హర్ష రెడ్డి, సాయి చంద్, సుస్రుత్, ఇతర రైతులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ కేసులో 27మందికి జరిమాన

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ నలుగురు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం రూ.4000 జరిమాన విధించారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్ కేసులో 27మందికి రూ.31,500 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె రామకృష్ణ తెలిపారు.

# చిప్ప వెంకటేశ్వర్లుకు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కొత్తవాడలోని 80 ఫీట్ల రోడ్డు అమరవీరుల స్థూపం దగ్గర డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డ్ గ్రహీత చిప్ప వెంకటేశ్వర్లను పద్మశాలి చేనేత బహుజన నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ నెల 9న ఢిల్లీలో జరిగిన 40 దళిత సాహిత్య అకాడమీ వార్షికోత్సవంలో వరంగల్ జిల్లా నుంచి జాతీయ అవార్డు అందుకున్న వెంకటేశ్వర్లు ఈ రోజు నగరానికి రాగా విషయం తెలుసుకున్న మిత్ర బృందం ఘన స్వాగతం పలికి ఘనగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా చిప్ప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మీ మధ్య పెరిగి మీ మధ్య తిరిగిన నాకు ఢిల్లీలో అవార్డు ఇవ్వడం దానికి మీరు సన్మానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ పేదలకు, వృద్ధులకు, అనాథలకు సేవచేస్తూ కుల మతాలకు అతీతంగా ప్రజా సేవ చేస్తున్న నాకు అవార్డు రావడం గర్వంగా ఉందని, ఈ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. మాజీ కార్పొరేటర్ దామెర సర్వేష్, మండల శంకర్, బేతి అశోక్, దువ్వల రాజేందర్, అదిగొప్పుల సంపత్ , ఏలుగం సాంబయ్య, ఎస్ కే హైదర్, మామిడాల నరేష్, ఈగ శ్రీధర్, పిట్ట రాములు, ఆడేపు రవి, నంబి మురళి, దానం రాజయ్య, బస్వరాజు మల్లేశం, గుల్లపెల్లి రవి, ఐత సమ్మయ్య, గుత్తికొండ తిరుపతి, వావిలాల భిక్షపతి, చిప్ప యాదగిరి, ఆడెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పేదలకు ఇందిరమ్మ ఇల్లు అందించడమే లక్ష్యం



**వరంగల్ వాయిస్, నడికూడ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు ఆరు గ్యారంటీల పథకాలలో భాగంగా ఇందిరమ్మ రాజ్యం ఇంటింటి సౌభాగ్యం అనే రీతిలో సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో నిరుపేదలను గుర్తించి, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నారని కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు భైరపాక భద్రయ్య అన్నారు. శుక్రవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామంలో ఇంటింటీ సర్వే ఇందిరమ్మ యాప్ లో నమోదు పక్రియను గ్రామ పంచాయతీ కార్యదర్శి భార్గవి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భైరపాక భద్రయ్య మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, కాంగ్రెస్ అంటే ఇందిరమ్మ ఇల్లు అని, ఇందిరమ్మ ఇల్లు కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపాధ్యక్షులు పరామండ్ల మహేందర్, కోశాధికారి బొమ్మకంటి విజేందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అధ్యక్షులు బుస్స కుమార్, రాయిడి దేవేందర్ రెడ్డి, మామిడి నర్సయ్య, పొన్నం పూర్ణచందర్, బొమ్మకంటి నాగరాణి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మంద మొగిలి, ఎస్సీ సెల్ నాయకులు మేకల సుధాకర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి

## రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వేముల బాలరాజు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** పద్మశాలి కులస్తులు అన్ని రంగాల్లో రాణించడంతో పాటు రేపు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని, ఐక్యత మన బలమని ఈనెల 17న తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం హైదరాబాదులో జరుగుతుందని సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడ8 వేముల బాలరాజు పద్మశాలి తెలిపారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాదులోని సికింద్రాబాద్ లోని హరహర కళ భవనంలో మంగళవారం ఉదయం 11 గంటలకు నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించడం జరుగుతుందన్నారు. పద్మశాలి కులస్తులు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంఘం సహాయ కార్యదర్శి గజ్జల దామోదర్ పద్మశాలి, జనగామ జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి పద్మశాలి, చిల్పూర్ మండల అధ్యక్షులు బండారి రాజకుమార్, యూత్ అధ్యక్షులు పేరాల నాగభూషణం పద్మశాలి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ముందడుగు

## ➲ అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** విద్యతోనే ముందడుగు సాధ్యమని, విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, చదువు అనే నిచ్చెనతో ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చునని విద్యార్థులు ఇటువంటి ప్రేరణ కార్యక్రమాలను సద్వినియోగపరుచుకోవాలని అడిషనల్ కలెక్టర్ లెనిన్ టోప్పో అన్నారు. శుక్రవారం నాడు కలక్టరేట్ లో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సహకారంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు మూడు నెలల పాటు నిర్వహించే జిల్లావ్యాప్త ప్రేరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమ రూపకర్త సైకాలజిస్ట్ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల ఫలితాలను పెంపొందించేందుకు పరీక్షల్లో విజయం సాధించాలంటే అనే అంశంపై ఉచితంగా ప్రేరణ సదస్సులు




నిర్వహించనున్నామని తెలిపారు. విద్యార్థులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు వీటిని సద్వినియోగపరచుకోవాలని కోరారు. అనంతరం అతిథులు కార్యక్రమ పోస్టర్లు, బ్యానరు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సుంకరనేని నాగవాణి, సభ్యులు డాక్టర్ డేవిడ్, వి.ఎలియా, రమేష్ పాల్గొన్నారు.

# స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి

## ▪ ఏఐపీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి




**వరంగల్ వాయిస్, నర్సంపేట :** దేశంలోని రైతాంగం పట్ల, వ్యవసాయ రంగ అభివృద్ధి పట్ల కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న వ్యవసాయ రంగంలో స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి చంద్రన్నలు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం నర్సంపేట డివిజన్ కేంద్రంలో ఏఐపీకేఎస్ వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం మైదంపాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కెచ్చల రంగారెడ్డి, చంద్రన్నలు మాట్లాడుతూ రాష్ట్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఒక క్వింటాల్ వరి ధాన్యానికి తరుగు పేరిట 5 నుంచి 7 కిలోల చొప్పున తీస్తూ రైతుల నిలుపు దోపిడీని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పోడుభూమి పట్టాలు లేని రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అనేక ఆంక్షలు విధిస్తూ పోడు రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యానికి ప్రకటించిన రూ.500 బోనస్ ను దొడ్డు ధాన్యానికి కూడా వర్తింప చేయాలన్నారు. వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి, ఇతర అన్ని రకాల పంటలకు పంట బీమా పథకాన్ని, అలాగే రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అలాగే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.15,000 ఇస్తానని చెప్పిన హామీని వెంటనే అమలు చేయాలని, లేకపోతే రైతు కూలీలంతా సంఘటితమై ఢిల్లీ తరహాలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐపీకేఎస్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి, జిల్లా నాయకులు ధార లింగన్న, కత్తుల కొమురయ్య, గటికొప్పుల రవి, కుమార్, యాకన్న, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల దొంగల అరెస్ట్



**వరంగల్ వాయిస్, దామెర :** చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని పరకాల నూతన ఏసీపీ సతీష్ బాబు అన్నారు. దామెర పోలీస్ స్టేషన్ లో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 9న తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో మండలంలోని కొగిల్వాయి గ్రామంలో జరిగిన గొర్రెల దొంగలను అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్న వివరాలను వెల్లడించారు. ఏ1గా బమ్మ తిరుపతి నిజాంపల్లి గ్రామం రేగొండ మండలం. ఏ2గా అన్నిమల్ల భరత్ చల్వాయి గోవిందరావుపేట మండలం, ఏ3గా వంగూరి మధు కొత్తపేట వరంగల్ వీరు చిన్నప్పటి నుండి స్నేహితులు నాటు కోళ్లు, చిల్లర దొంగతనాలు చేసి జల్సాలు చేసేవారు. వీరికి రెండు సంవత్సరాల క్రితం కొత్తకొండ వికాస్ ఘట్కేసర్ పరిచయం కావడంతో వికాస్ వారితో లాంగ్ డ్రైవ్ లో కారు బుక్ చేసుకుని మనం అందులో గొర్రెలను, మేకలను దొంగతనం చేస్తే ఎవరికి అనుమానం రాదని చెప్పి కార్లను బుక్ చేసుకొని నల్గొండ, చిట్యాల వైపు దొంగతనాలకు పాల్పడ్డారు. తర్వాత వరంగల్ లోని దుగ్గొండి, కమలాపూర్, చెన్నారావుపేట, కొయ్యూరు, గీసుకొండ, దామెర ప్రాంతాలలో 9 దొంగతనాలు చేశారు. వీటిని హైదరాబాద్ వరంగల్ సంతలలో అమ్ముకొని వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారని తెలిపారు. 8 దొంగతనాలలో బొమ్మ తిరుపతి అన్నిమల్ల భరత్, కొత్తకొండ వికాస్ లు పాల్గొనగా మరో రెండు దొంగతనాలలో వంగూరి మధు పాల్గొన్నాడు. కోగిల్వాయి గ్రామంలో గొర్రెల దొంగతనానికి వచ్చినప్పుడు గొర్రెల అలజడిని గమనించిన గ్రామవాసి జంగిలి రవి చూసి వికాస్ ను గట్టిగా పట్టుకోగా వికాస్ రాయితో కొట్టి పారిపోయాడు. అప్పుడు కారును సెల్ ఫోనును వదిలి పారిపోగా దామెర పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. శుక్రవారం తిరుపతి, భరత్, మధులు వదిలి వెళ్లిన కారును తీసుకుపోదామని రాగా, గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ రంజిత్ రావు, ఎస్సై అశోక్ , కానిస్టేబుల్ శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
శుక్రవారం 13 డిసెంబర్ 2024
7





# గూస్‌బంప్స్ తెప్పిస్తున్న డాకు మహారాజ్

**బాబీ దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తోన్న చిత్రం డాకు మహారాజ్. ఎన్‌బీకే 109గా వస్తోన్న ఈ చిత్రంలో బాలకృష్ణ టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడు. సంక్రాంతి కానుకగా 2025 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ మూవీ ఫస్ట్ సింగిల్ ప్రోమోను విడుదల చేశారు. దేగ దేగ దేగ.. అంటూ సాగుతున్న ప్రోమో గూస్ బంప్స్ తెప్పిస్తోంది. అనంత్ శ్రీరామ్ రాసిన ఈ పాటను నకాశ్ అజీజ్ పాడాడు. బాలకృష్ణ గండ్రగొడ్డుళ్లు పట్టుకొని సమరంలో ఉన్న లుక్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌతేలా, శ్రద్ధా శ్రీనాథ్ ఫీమేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నాడు. ప్రగ్యాజైశ్వాల్, చాందినీ చౌదరి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ , సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మేకర్స్ యూఎస్‌ఏ టెక్సాస్‌లోని డల్లాస్‌లో 2025 జనవరి 4న సాయంత్రం 6 గంటల నుంచి ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నట్టు ఇప్పటికే ప్రకటించారు.**

# సంక్రాంతికి మీ ఇంటికొస్తున్నాం

క్లాస్, మాస్, కామెడీ, ఫ్యామిలీ.. ఇలా అన్ని జోనర్లలో సినిమాలు చేస్తూ కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్. తనదైన కామిక్ స్టైల్ ఆఫ్ యాక్షన్‌తో ఎంటర్‌టైన్ చేసే వెంకీమామ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ఇండస్ట్రీ ప్రముఖులు, అభిమానులు, మూవీ లవర్స్, ఫాలోవర్లు వెంకీ మామకు బర్త్ డే విషెస్ తెలియజేస్తున్నారు. తాజాగా అనిల్ రావిపూడి టీం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ సంక్రాంతికి వస్తున్నాం నుంచి మీను సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. మీనాక్షి చౌదరి గురించి ఈ పాట ఉండబోతున్నట్టు ప్రోమో చెబుతోంది. సాంగ్‌లో వెంకీ పోలీసాఫీసర్‌గా సూపర్ స్టైలిష్‌గా కనిపిస్తూ ఘర్షణ సినిమాను మరోసారి గుర్తుకు తెస్తున్నాడు. ఇప్పటికే గోదారి గట్టు మీద రామసిలకవే.. ఓ... గోరింటాకెట్టుకున్న సందమామవే అంటూ సాగే ఫస్ట్ సింగిల్‌కు నెట్టింట సూపర్ రెస్పాన్స్ వస్తోంది. భాస్కర భట్ల రాసిన ఈ పాటను రమణ గోగుల, మధుప్రియ పాడగా.. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించాడు. ఈ మూవీ 2025 సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రంలో పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు.



# బన్నీ అరెస్ట్..



## అల్లు అర్జున్ ఇంటికి వెళ్లిన చిరంజీవి

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద పుష్ప 2 విడుదల రోజున జరిగిన ఘటనకు సంబంధించి కథానాయకుడు అల్లు అర్జున్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. అరెస్ట్ అనంతరం బన్నీని పోలీసులు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తున్నారు. స్టేట్‌మెంట్ రికార్డు అనంతరం అతడిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించనున్నట్లు తెలిసింది. వైద్య పరీక్షల అనంతరం నాంపల్లి కోర్టు ముందు హాజరుపర్చనున్నారు. ఈ మేరకు అల్లు అర్జున్‌ను రిమాండ్‌కు తరలించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే అల్లు అర్జున్ కోసం ఇప్పటికే తన తండ్రి అల్లు అరవింద్‌తో పాటు తమ్ముడు అల్లు శిరీష్ కూడా చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయం తెలిసిన మెగాస్టార్ చిరంజీవి కూడా అల్లు అర్జున్ కోసం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు బయలుదేరగా.. చిరంజీవి వస్తే.. ట్రాఫిక్ సమస్యలతో పాటు అతడిని చూడడానికి జనాలు రానుండటంతో అతడిని పోలీస్ స్టేషన్‌కు రావొద్దని అభ్యర్థించినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే స్టేషన్‌కు రాకుండా అల్లు అర్జున్ ఇంటికి వెళ్లాడు చిరంజీవి. విశ్వంభర షూటింగ్‌లో ఉన్న చిరు ఈ విషయం తెలియగానే షూటింగ్ మధ్యలో ఆపి బన్నీ ఇంటికి వచ్చినట్లు తెలుస్తుంది.

## దుస్తులు మార్చుకోవటానికీ టైం ఇవ్వరా..? : అల్లు అర్జున్

అరెస్ట్ చేసే సమయంలో బన్నీ నివాసం దగ్గర హైడ్రామా కొనసాగింది. పోలీసుల తీరుపై అల్లు అర్జున్ అసహనం వ్యక్తం చేశాడు. పోలీసులు తనను తీసుకెళ్లడంలో అభ్యంతరం లేదన్న అల్లు అర్జున్ ఉన్న పళంగా తమతో రావాలంటే ఎలా..? దుస్తులు మార్చుకునేందుకు అవకాశం కూడా ఇవ్వరా..? అంటూ ప్రశ్నించాడు. దీంతో పోలీసులు అల్లు అర్జున్ బెడ్‌రూం వరకు వెళ్లి డ్రస్ మార్పించి టీ షర్ట్, షార్ట్‌లో పీఎస్‌కు తీసుకెళ్లారు.అల్లు అర్జున్‌తోపాటు తండ్రి అల్లు అరవింద్ కూడా వాహనం ఎక్కాడు. అయితే తండ్రిని వాహనం ఎక్కొద్దంటూ వారించి కిందికి దించేశాడు. ఏం జరిగినా.. మంచైనా చెడైనా అంతా నాదేనంటూ చెప్పాడు. పోలీసుల రాక నేపథ్యంలో బన్నీ సతీమణి స్నేహారెడ్డి కన్నీళ్లు పెట్టుకుంది. దీంతో ఆమెను దగ్గరకు తీసుకొని ధైర్యం చెప్పాడు అల్లు అర్జున్.

## అల్లు అర్జున్ అరెస్టుపై స్పందించిన సీఎం

టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లు అర్జున్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఇందులో తన జోక్యం ఏమీ ఉండదని.. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. చట్టపరమైన ప్రక్రియ జరుగుతుందన్నారు. తొక్కిసలాటలో ఒకరు చనిపోయిన నేపథ్యంలో పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని.. మోహన్ బాబు విషయంలో కోర్టు ఉత్తర్వులున్నాయన్నారు. ఈ నెల 4న ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప–2 బెనిఫిట్ షో సందర్భంగా వచ్చారు. ఆ సమయంలోనే ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో రేవతి అనే మహిళ మృతి చెందింది. ఆమె కుమారుడు గాయాలకు గురయ్యాడు. ఘటనలో మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు అల్లు అర్జున్‌తోపాటు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్టు చేశారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు. అల్లు అర్జున్‌పై బీఎన్‌ఎస్ 118 (1), బీఎన్‌ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. రేవతి మృతిపై అల్లు అర్జున్ దిగ్భ్రాంతి వ్యక్తం చేయడంతో పాటు ఆమె కుటుంబానికి రూ.25లక్షల సాయం ప్రకటించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ క్రమంలో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు అనంతరం గాంధీ ఆసుపత్రిలో పరీక్షలు చేశారు. ఆ తర్వాత ఆయనను కోర్టులో హాజరుపరుచనున్నారు. మరో వైపు పుష్ప స్టార్ తరపు న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు.

# కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- సీఎంతో కలిసి కేంద్ర రైల్వే శాఖ మంత్రికి వినతి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటును పేర్కొన్న విషయాన్ని కేంద్ర మంత్రికి ఎంపీ గుర్తు చేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి తెలంగాణ రైల్వే ప్రాజెక్టుల పురోగతి అంశాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తో చర్చించిన సందర్భంలో నష్కల్–హసన్ పర్తి, నష్కల్–చింతలపల్లి బై పాస్ లైన్ కారణంగా వరంగల్ త్రినగరి అభివృద్ధికి అవరోధాలేర్పడకుండా, రైతాంగం వ్యవసాయ కమతాలు ముక్కలు కాకుండా ఉండే రీతిలో తాను ప్రత్యామ్నాయ అలైన్ మెంట్ ప్రతిపాదనలు చేయనున్నట్టు కడియం కావ్య పేర్కొన్నారు. కాజీపేటలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటవుతున్న వ్యాగన్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్, కాజీపేట ప్లాట్ ఫామ్ ల విస్తరణ గురించి కూడా మంత్రితో జరిగిన సమావేశంలో పునరుద్ఘాటించగా, ఈ అంశంలో మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించినట్లు డాక్టర్ కడియం కావ్య వెల్లడించారు. కాజీపేటలో పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ (పీవోహెచ్) వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించిందని గుర్తు చేశారు. ఆ తర్వాత సైతం కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారని వివరించారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అనేది కాజీపేట వాసుల కల మాత్రమే కాదని.. యావత్ తెలంగాణ స్వప్నమని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ పార్లమెంట్ సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. అదే విధంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు డాక్టర్ కడియం కావ్య, సహచర పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

# సమష్టిగా అభివృద్ధి చేద్దాం

- మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి
- పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి
- వరంగల్, హనుమకొండ కలెక్టర్ లతో కలిసి సమీక్ష




**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల నియోజక వర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపించేందుకు రెండు జిల్లాల కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో శుక్రవారం వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, పి.ప్రావీణ్యతో కలిసి రెండు జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పరకాల నియోజకవర్గ అభివృద్ధికి సోలార్ పవర్ ప్లాంట్లు, డైరీ ఫామ్ లను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పించుటకు ఏర్పాట్లు చేయాలని రెండు జిల్లాల కలెక్టర్లను కోరారు. ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారత లక్ష్యంగా కృషి చేయాలన్నారు. మండలానికి ఒక సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు కావాల్సిన ప్రభుత్వ భూములను స్థానిక తహసీల్దార్లు గుర్తించాలన్నారు. ప్రజలకు నాణ్యమైన పాలు అందించేందుకు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు డైరీ ఫాంల ఏర్పాటు అవసరమన్నారు. అందుకు కావల్సిన ఏర్పాట్లు చేయాలంటూ జిల్లా కలెక్టర్లను కోరారు. ఉకల్, సంగెం, కాపుల కనపర్తి సొసైటి సభ్యులతో కలిసి ములుకనూర్ డైరీని సందర్శించామని, అందులో దాదాపు 20 వేల మంది మహిళలు విజయవంతంగా డెయిరీ ఫాంను నడిపిస్తున్నారని సూచించారు. తద్వారా రోజుకు దాదాపు 60 నుంచి 70 వేల లీటర్ల పాలు ఉత్పత్తి చేసి హైదరాబాద్ తో సహా వివిధ ప్రాంతాలకు పాలు సరఫరా చేయగలుగుతున్నారని అదే తరహాలో నియోజక వర్గం అభివృద్ధికి ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, వరంగల్, హనుమకొండ డీఆర్ డీఓ పీడీలు కౌసల్యాదేవి, ఎం.శ్రీనివాస్, ఎల్ డీఎం రాజు, శ్రీనివాసులు, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి, రెండు జిల్లాల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మెరుగైన వైద్యం అందించాలి

## శాసన మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రేగొండ మండలం, రంగయ్యపల్లి గ్రామానికి చెందిన చిర్రా క్రాంతి కుమార్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, శుక్రవారం శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. సంబధిత వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అండగా ఉంటానంటూ హామీ ఇచ్చారు.



# 'ఎంబాడి' జయంతి సందర్భంగా పండ్ల పంపిణీ

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ డిప్యూటీ మేటర్ స్వర్గీయ ఎంబాడి రవీందర్ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన అభిమానులు అండర్ బ్రిడ్జి సమీపంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంబాడి రవీందర్ చేసిన సేవలను నెమరు వేసుకున్నారు. ఆయన జీవించి ఉన్నంత కాలం ప్రజా సేవలోనే తరించారన్నారు.

# అటు జైలు.. ఇటు బెయిల్



**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో అరెస్టైన అల్లు అర్జున్ కు బిగ్ షాక్ తగిలింది. ఆయనకు నాంపల్లి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. ఈ మేరకు చంచల్ గూడా జైలుకు అల్లు అర్జున్ ను తరలించారు. అయితే బన్నీ తన కుటుంబ సభ్యులు, చిత్ర బృందంతో థియేటర్ కు రావడం వల్లే తొక్కిసలాట జరిగిందని, అందుకే ఆయన్ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు కోర్టుకు నివేదించారు. పోలీసుల వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి బన్నీకి రిమాండ్ విధించారు. ఇదిలా ఉండగా.. అల్లు అర్జున్ అరెస్టని సవాల్ చేస్తూ హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే శుక్రవారం మధ్యాహ్నమే అల్లు అర్జున్ ను అరెస్ట్ చేసిన చిక్కడపల్లి పోలీసులు అయనకు కొద్ది సేపు విచారించిన తర్వాత గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ బన్నీకి వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్కడినుంచి నేరుగా నాంపల్లి కోర్టుకు తరలించగా వాదనలు విన్న న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. అయితే దీనిపై విచారణ జరిపిన హైకోర్టు అల్లు అర్జున్ కు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. చంచల్ గూడా జైలు సూపరింటెండెంట్ కు వ్యక్తి గత పూచి కత్తులు సమర్పించి బెయిల్ తీసుకోవాలంటూ అల్లు అర్జున్ కు సూచించింది. ఈ మేరకు అల్లు అర్జున్ అభిమానుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

# గ్రూప్-2 పరీక్షలకు భారీ బందోబస్తు

**వరంగల్ వాయిస్, క్రైం :** జిల్లా పరిధిలో డిసెంబర్ 15, 16 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్–2 పరీక్షలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) యాక్ట్ –2023 అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు 15వ తేది ఉదయం ఆరు గంటల నుంచి 16వ తేది సాయంత్రం ఏడు వరకు అంక్షలు అమలులో ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని, ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డిజేలు ఉరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. ఎవరైనా ఈ ఉత్తర్వులు అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.



# ఇంటి పెరట్లో గంజాయి మొక్కల పెంపకం

**వరంగల్ వాయిస్, క్రైం :** ఇంటి పెరట్లోనే గంజాయి మొక్కలను పెంచుతున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెలితే..సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాయంపేట ప్రాంతంలో నివాసముంటున్న 72 సంవత్సరాల వృద్ధుడు అట్ల వెంకట నర్సయ్య వ్యవసాయంకూలీగా పనిచేస్తూనే సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. దీనికి గాను తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు పెంపకం ప్రారంభించారు. అవి ఐదు అడుగుల ఎత్తుకు చేరుకున్నాయి. వాటిలో కొన్ని మొక్కలను ఎండబెట్టి విక్రయించేందుకు సిద్దమయ్యాడు. అయితే తన ఇంటి ఆవరణలోనే గంజాయి మొక్కల పెంపకం చేపట్టినట్లు యాంటీ డ్రగ్స్ కంట్రోల్ టీంకు సమాచారం రావడంతో ఇన్ స్పెక్టర్ సురేష్, ఆర్ఐ శివ కేశవులతో కలిసి తనిఖీలు నిర్వహించగా గంజాయి మొక్కలు కనిపించాయి. దీంతో వెంకట నర్సయ్యను అదుపులోకి తీసుకొని సుబేదారి పోలీసులకు అప్పగించారు. సదరు నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఈ తనిఖీల్లో ఆర్ఎస్ఐలు పూర్ణ, మనోజ్, నాగరాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com